



పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, షబ్బీర్



అలుగు దూకుతున్న పోచారం ప్రాజెక్టు

కాలచక్రం 2024

కర్షకుడికి కలిసొచ్చిన కాలం

- ఈ ఏడాది పంటల సాగు ఆగుతూ.. సాగుతూ!
- వానాకాలంలో ఆలస్యమైనా విస్తారంగా వర్షాలు
- జలకళను సంతరించుకున్న ప్రాజెక్టులు, చెరువులు
- రైతన్నకు అండగా నిలిచిన ప్రభుత్వ పథకాలు
- రూ.2లక్షల రుణమాఫీ.. సన్నాలకు రూ.500ల బోనస్
- ధాన్యానికి మార్కెట్‌లో మంచి ధర
- పత్తి రైతులకు దక్కని మద్దతు ధర
- సోయాలు, మక్కలకు సైతం డిమాండ్

కామారెడ్డి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం కర్షకునికి కలిసి వచ్చింది. ఓవైపు విస్తారంగా వర్షాలు కురువడంతో పంటల సాగులో అన్నదాతలు బిజీ కాగా మరోవైపు ప్రభుత్వం సైతం రైతులకు అండగా ఉంటూ రుణ మాఫీ, బోనస్ లాంటి పథకాలను అమలు చేసింది. అంతేకాకుండా రైతులు పండించిన వరి, మొక్కజొన్న, సోయాతో పాటు ఇతర పప్పుదినుసు పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ పలికింది. ప్రభుత్వ మద్దతు ధరకంటే బహిరంగ మార్కెట్‌లో వరికి అదనపు ధర పలకడంతో కొనుగోలు కేంద్రం కంటే బయట వ్యాపారులకే రైతులు విక్రయించారు. ఈ యాసంగి పంటలపైన రైతులు మరింత ఆశపెట్టుకున్నారు. విస్తారంగా వర్షాలు కురువడంతో జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ప్రభుత్వం సన్నాలకు రూ.500ల బోనస్ ఇస్తుండడంతో రైతులు సన్న వరి సాగుపై దృష్టి సారించారు. గత యాసంగి సీజన్‌లో వడగండ్ల వర్షాలతో కొంతమంది రైతులకు నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలకు సైతం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. ఇలా ఏడాది కాలంలో రైతుల పంటల సాగు ఆగుతూ.. సాగుతూ వచ్చింది. మరో రెండు రోజుల్లో ఏడాది ముగియనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో రైతులకు కష్టనష్టాలు, లబ్ధిచేకూరిన పంటల సాగుపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఆలస్యమైనా ఆశించిన మేర కురిసిన వర్షాలు

జిల్లాలో జూన్ రెండో వారం నుంచే వానాకాలం సాగు సందడి మొదలవుతోంది. అయితే ఈ సంవత్సరం జూన్ నెల ముగుస్తున్నా ఆశించిన మేర వర్షాలు పడలేదు. దీంతో రైతుల్లో కాస్త ఆందోళన నెలకొంది. అడపా దడప కురిసిన వర్షాలతో సోయా, మొక్కజొన్న లాంటి ఆరుతడి పంటల ను సాగు చేశారు. జూలై లోనూ ఇదే పరిస్థితి నెలకొంటుంది. దీంతో అన్నదాతలు వరి సాగుపై సందిగ్ధంలో పడ్డారు. ఆగస్టు నెలలో విస్తారంగా వర్షాలు కురిశాయి. రికార్డు స్థాయిలోనే వర్షపాతం నమోదైంది. కామారెడ్డి డివిజన్‌తో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లోను భారీ వర్షాలు కురువడంతో వాగులు, వంకలు పోటెత్తాయి. కేవలం పక్షం రోజుల్లోనే జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్, సింగీతం, కళ్యాణీ రిజర్వాయర్‌లు సైతం పూర్తిగా నిండుకున్నాయి. జిల్లాలో సుమారు 1500 లకు పైగా చెరువులు పూర్తిగా నిండుకోవడంతో జలకళను సంతరించుకున్నాయి. దీంతో జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు 6లక్షల ఎకరాలకు పైగా వివిధ పంటలు సాగయ్యాయి. ఆ స్థాయిలోనే పంటల దిగుబడులు కూడా వచ్చాయి.

రైతు పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్

వానాకాలం సీజన్‌లోనే కాకుండా గత యాసంగి సీజన్‌లోనూ రైతులు పండించిన పంటలకు ఈ ఏడాది గిట్టుబాటు ధర లభించింది. ప్రభుత్వం మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో వరి, మొక్కజొన్న, సోయా, కందులు లాంటి ఉత్పత్తులకు మంచి ధర ఉండడంతో రైతులు ఎక్కువగా ప్రైవేట్ వారికే విక్రయించారు. ఈ వానాకాలం సీజన్‌లో 5.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకోగా 4.30లక్షల మెట్రిక్ టన్నులలో కొనుగోలు చేశారు. అంటే లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతులు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించారు. బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతోనే ప్రైవేట్‌కు విక్రయించినట్లు తెలుస్తోంది. మద్దతు ధరనే కాకుండా వరి, మొక్కజొన్న, సోయా లాంటి పంటలు సైతం మంచి దిగుబడులు వచ్చాయి. దీంతో రైతులకు ఈ ఏడాది కాస్త గిట్టుబాటు ధర లభించిందనే చెప్పవచ్చు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

ఎన్నికల సమయంలో రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ, పండించిన వరి పంటకు బోనస్ అమలు చేస్తోంది. ప్రధానంగా ఈ ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తూ వచ్చింది. నాలుగు విడతల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసింది. రెండు రోజుల క్రితం రైతుపండుగ సందర్భంగా మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నాలుగో విడత రుణమాఫీ లబ్ధిదారుల వివరాలను, నిధులను విడుదల చేశారు. ఈ నాలుగో విడతలో జిల్లాలో 10,157 రైతు కుటుంబాలకు రూ.82.10కోట్ల రుణమాఫీ జరిగింది. జిల్లాలో ఇప్పటి వరకు 1,01,415 రైతు కుటుంబాలకు రూ.728.47 కోట్ల మాఫీ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో సన్న వడ్లు పండించిన 11,365 మంది రైతులకు రూ.37.17 కోట్ల బోనస్ నిధులను రైతుల ఖాతాలో జమ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో అన్నదాతకు అండగా ఉంటూ రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వచ్చారు. దీంతో రైతులకు సైతం ఊరట లభించింది.

వడ గండ్లు.. అకాల వర్షాలు

ఈ సంవత్సరంలోనూ ప్రకృతి రైతన్నపై కన్నెర్ర చేసింది. ప్రధానంగా యాసంగి సీజన్‌లో పంటలు చేతికొచ్చే సమయంలో వడగండ్ల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేశాయి. పంటలు చేతికొస్తున్న సమయంలో మార్చి నెలలో వడగండ్ల బీభత్సం సృష్టించడంతో వేల ఎకరాల్లోనే రైతుల పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 20 వేల ఎకరాలకు పైగా వివిధ పంటలు దెబ్బతినగా 14,553 మంది రైతులకు నష్టం వాటిల్లింది. అదేవిధంగా ఈ వానాకాలం సీజన్‌లోనూ ఎడతెరపు లేకుండా భారీ వర్షాలు కురువడంతో వరదల తాకిడికి పంటలు కొట్టుకుపోవడమే కాకుండా వరదలో మునిగిపోయాయి. సుమారు 2వేల ఎకరాలకు పైగా వరి, సోయా పంట నీటి మునిగిపోవడంతో రైతులు నష్టపోయారు. వానాకాలం పంటల కోతల సమయంలోనూ అకాల వర్షాలు పడడంతో రైతుల ధాన్యం తడిసిపోయింది. ఏప్రిల్‌లో వడ గండ్ల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీలు రైతు పక్షాన ఆందోళనలు, నిరసనలు చేపట్టాయి. అదేవిధంగా ప్రభుత్వం తరపున కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జిల్లాలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను పరామర్శించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



రైతు సంబరాల్లో ఎడ్ల బండిపై జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



..క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



..ర్యాలీగా వెళ్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



.. నాగలిని ఎత్తుకున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



రైతు సత్యాగ్రహ దీక్షలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్



రైతులను ఆదుకోవాలంటూ బీఆర్ఎస్ నాయకుల నిరసనలు

సర్వేకు ఐదు రోజులే గడువు

- ఇందిరమ్మ ఇళ్ల కోసం 2.38 లక్షల దరఖాస్తులు
- ఇప్పటి వరకు 1.39 ఇళ్లలో పూర్తయిన సర్వే
- సాంకేతిక సమస్యలతో సర్వే సిబ్బంది సతమతం



కామారెడ్డి పట్టణంలో సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కామారెడ్డి టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనకు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది. వచ్చే నెల 3లోపు సర్వే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుండడంతో క్షేత్రస్థాయిలో ఉన్న సాంకేతిక సమస్యలతో ఆలోపు సర్వే పూర్తవుతుందో లేదోనని సర్వే చేస్తున్న సిబ్బంది సతమతం అవుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 2,38,682 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరి సర్వేపూర్తి చేయాలంటే మరింత సమయం అవసరంకానుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ సర్వే సమయంలో సిగ్నల్ ఇబ్బందులు, మొబైల్ యాప్ పని చేయకపోవడం, దరఖాస్తుదారులు కొందరు అందుబాటులో ఉండకపోవడంతో సర్వేలో పాల్గొంటున్న సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

1,39,194 దరఖాస్తుల సర్వే పూర్తి

కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల హామీ అమలుకు అనుగుణంగా ప్రక్రియను ప్రారంభించింది. 400 చదరపు అడుగుల స్థలం తగ్గకుండా ఇంటి నిర్మాణం చేయాలని సూచించింది. నియోజకవర్గానికి 3500 ఇళ్లు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ అవసరాన్ని బట్టి పెంచే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా జిల్లాలో ఈనెల 9 నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన క్షేత్రస్థాయిలో ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతరశాఖల సిబ్బంది సర్వే చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలనతో పాటు గృహ నిర్మాణశాఖ రూపొందించిన మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. యాప్‌లో 14 కాలమ్స్‌లో వివరాలను పూర్తి చేస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,38,682 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1,39,194 ఇళ్ల సర్వే పూర్తయిందని అధికార వర్గాలు వెల్లడించాయి. సర్వే అనంతరం ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని పేర్కొంటున్నారు.

సాంకేతిక సమస్యలతో సతమతం

క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టిన సిబ్బందికి మొబైల్ యాప్‌లో కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ యాప్‌లో వివరాల నమోదుతో పాటు ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. తొలుత సొంత ఇల్లా.. అద్దెదా అనే వివరాలు, ఆ తర్వాత ప్రస్తుతం ఉంటున్న ఇంటి ఫొటో, ఖాళీ స్థలం ఉంటే అందుకు సంబంధించిన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత ఇంటి స్థలం ఎవరి పేరుతో ఉందో ఆ వివరాలను కూడా అక్కడ పొందుపరచాలి. అయితే ఇవ్వన్నీ పూర్తిచేస్తున్న సమయంలో సాంకేతిక సమస్యలతో మొబైల్ యాప్ పలుమార్లు మొరాయిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య తలెత్తుతుండగా పట్టణ ప్రాంతాల్లో సర్వర్ పని చేయడం లేదు. దీంతో ఒక ఇంటి వద్దనే చాలా సమయం వెచ్చించాల్సి వస్తుందని పలువురు సర్వే సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే వచ్చే నెల 3లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని సూచిస్తుండడంతో మరో లక్ష వరకు సర్వే చేయాల్సి ఉందని వాటిని ఐదు రోజుల్లో పూర్తి చేయడం సాధ్యమవుతుందా అనే ప్రశ్నలు సిబ్బంది నుంచి వెలువడుతున్నాయి. ఇదిలా ఉంటే పలుచోట్ల అసలు పూరి గుడిసె, రేకులషెడ్డు, ఖాళీ స్థలం ఉన్న వారి పేర్లు సర్వే చేస్తున్న సిబ్బంది వద్ద లేకపోవడంతో తమపేర్లు ఎందుకు రాలేదంటూ దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. అంతస్తుల కొద్ది బిల్డింగ్‌లు ఉన్నవారు సైతం దరఖాస్తు చేసుకుంటే వారి పేర్లు సర్వేలో వస్తున్నాయని అసలైన లబ్ధిదారుల పేర్లు మాత్రం కనిపించకుండా పోయాయని ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



డేంజర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ లేకుండా తక్కువ ఎత్తులో ఏర్పాటు
- మూగ జీవాలకు శాపంగా మారిన వైనం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

7

నూతన సంవత్సర వేడుకల్లో

డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్లొద్దు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్లొద్దని కామారెడ్డి ఎక్సైజ్ ఎస్ఐ విక్రమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతిలేని ప్రదేశాల్లో మద్యం తాగిన, హోటళ్లలో, దాబాల్లో, పబ్లిక్‌ప్లేస్‌లో తాగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫంక్షన్‌హాల్‌లో అయితే ఖచ్చితంగా ప్రొబేషన్స్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అనుమతి తీసుకోవాలని వివరించారు. ఇతర రాష్ట్రాల మద్యంను కూడా తీసుకొనిరావద్దని వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా వివరించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎక్సైజ్ కామారెడ్డి జిల్లా నుంచి 4 ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తామన్నారు. కేసులో పట్టుబడితే తగిన చర్యలు తీసుకోనబడతాయని ఆయన ప్రకటనలో వివరించారు.

'బాధితులకు అండగా ఉంటాం'



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

డొంకేశ్వర్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారానికి చెందిన సాదు ల సాయికిర్తన రూ.6వేలు, నడ్కుడకు చెందిన సాయిరెడ్డి రూ.54వేలు, నికాల్‌పూర్‌కు చెందిన సంధ్యారాణి రూ.14వేల సీఎంఆర్ఎఫ్ మంజూరు కాగా ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సుమన్, సుద్ద చిన్నయ్య, నాగరాజు, మాజీసర్పంచ్ పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాస్త్రీనగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆవి ర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకుడు శ్రావన్‌కుమార్ ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. 1970 సంవత్సరంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించి విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని, విద్యా ర్థులను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కరించడంలో ముందుంటుందన్నారు. నూతన జాతీ య విద్యావిధానాన్ని రద్దు చేయాలని, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రను తిప్పికొడుతూ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే మూడు లక్ష్యాలను సాధించే వరకు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. నవసమాజ నిర్మాణం తమ లక్ష్యామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యావిధానంపై అడుగులు వేసి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, నాయకులు రాజు, సంజయ్, చందు, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాల్వలోకి దూసుకెళ్లిన క్రేన్



కాకతీయ కాలువలో నుంచి క్రేన్‌ను బయటకు తీస్తున్న మరో క్రేన్

మెండోర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లపై జరుగుతున్న మరమ్మతు పనులను క్రేన్ సహాయంతో పనులు చేస్తున్నారు. ప్రాజెకు పైకి వెళ్ళి తిరిగి దిగువకు దిగుతున్న సమయంలో క్రేన్‌బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో కాకతీయ కాలువలోకి క్రేన్ దూసుకెళ్ళింది. క్రెన్‌డ్రైవర్ అప్రమత్తం కావడంతో క్రెన్‌లో నుంచి దూకడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. క్రేన్ కాకతీయ కాలువలో పడ్డ విషయం తెలుసుకున్న ప్రాజెక్టు అధికారులు, కాకతీయ కాలువకు నీటి ప్రవాహం తగ్గించి మరోక క్రెన్ సహాయంతో కాలువలో పడ్డ క్రేన్‌ను బయటకు తీశారు.

పొలం గట్టుపై ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్దాపూర్ గ్రామశి వారులో వ్యవసాయ భూమిలో దత్తరావు(43)మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ప్రతీరోజు లాగే వ్యవసాయ భూమి లో పనులు చేయ డానికి వెళ్ళిన ఆయన ఆకస్మాత్తుగా గుండెపోటు రావడం తో పొలంగట్టుపై పడి మృతిచెందినట్టు ఆయన తెలిపారు. మృతుని భార్య భూమ బాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సావిత్రిబాయిపూలే జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు

వేల్పూర్ డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): భారతదేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అంబేద్కర్ యు వజన సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి జంబవచ మన్ మాట్లాడుతూ సావిత్రిబాయి జయంతి సంద ర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో సావిత్రిబ ాయిపూలే జయంతిని జరపాలని విద్యాశాఖ ద్వారా విద్యాసంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. విద్యాశాఖ ప్రత్యేకమైన జీవో జారీ చేసి కొన్ని విద్యాసంస్థలకు సావిత్రిబాయిపూలే పేరు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐ సుభాష్‌కు సన్మానం

వేల్పూర్ డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ యూని యన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన వేల్పూర్ మండలం లక్కోర గ్రామా నికి చెందిన ఎంవీఐ ఉట్నూర్ సుభాష్‌ను ఆదివారం పీఆర్‌టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. తమ మండలానికి చెందిన ఎంవీఐ సుభాష్ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేల్పూర్ మండల పీఆర్‌టీయూ ప్రధానకా ర్యదర్శి సి.వెంకటనర్సింహరావు, మండల కాంగ్రెస్ నాయకులు చదల్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బైరి సంపత్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, లక్కోర గ్రామ యువకులు, తదితరులు ఉన్నారు.



వేల్పూర్‌లో ఎంవీఐ సుభాష్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మున్సిపల్ ఏఈ, డీఈల నియామకమెప్పుడో?

● కుంటుపడుతున్న అభివృద్ధి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీర్ శాఖలో ఏఈ, డీఈల నియామకం ఎప్పుడు చేస్తారని నాయకులు, ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గత మూడు నెలల క్రితం సాధారణ బదిలీలలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఏఈ, డీఈలు వేరే చోటికి వెళ్ళిపోగా అప్పటి నుంచి ఇంజనీరింగ్ శాఖలో ఏఈ, డీఈల నియామకం జరగలేదు. దీంతో మున్సిపల్ పరిధి లో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. జనరల్ ఫండ్ నుంచి చేపట్టాల్సిన చిన్న చిన్న పనులు సైతం చేపట్టలేక పోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న డీఈ భూమేశ్వర్ వర్కింగ్ అరెంజ్‌మెంట్ బెస్‌లో వచ్చి సంతకాలను చేసి వెళ్తున్నారు. ఇలా ఎన్నాళ్లు కొనసాగుతుందని మున్సిపల్ పాలక వర్గం పదవీ కాలం నెల రోజులే ఉండడంతో వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉండడంతో దిక్కుతోచని స్థితిలో కౌన్సిలర్‌లు ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తమ గోసను అర్థం చేసుకొని ఏఈ, డీఈలను



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం

నియమించాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.

కార్మికులకు లేబర్ కార్డులు అందజేయాలి



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి దేవరాం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుక బట్టిలలో పనిచేస్తున్న కార్మికులకు లెబర్‌కార్డులను అందజేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో ఇటుక బట్టిలో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఇటుక బట్టిల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారికి అధార్‌కార్డు, లెబర్‌కార్డు లేక నానా అవస్థలు పడుతున్నారని, ఇటీవల లక్ష్మయ్య అనే కార్మికుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడం జరిగిందని, ఇప్పటి వరకు అధికారులు పరిశీలించిన దాఖ లాలు లేవన్నారు. స్థానికుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారు లు నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరించడం సరైందికాదని, లక్ష్మయ్య మర ణంతో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం లక్ష్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఇటుక బట్టిలో పని చేస్తున్న కార్మికులకు లెబర్‌కార్డులను జారీ చేసి వారు సమస్యలను పరిష్కరిం చాలని, లేనియెడల ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సీపీఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకులు జయవరం, కిషన్, శేఖర్, ఠాకూర్, అర్విండ్, నజీర్, నితిన్, సద్దార్థ్, నిఖిల్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగు జోరు



సాగు చేస్తున్న జొన్న పంట

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటల సాగుకింద మండలంలోని ఆయా గ్రామాలలో ఆరుతడి పంటల సాగు జోరుగా సాగుతోంది. పెద్ద కొడప్‌గల్ మండలం నాన్‌క మాండ్ ఏరియాలో ఉండటంతో ప్రధానంగా సాగంతా అధిక మొత్తంలో వర్షాధారంపై ఆధా రపడి ఉంటుంది. మండలంలోని ఆయా గ్రామాలలో చెరువులు తక్కు వగా ఉండటంతో రైతన్నలు ఆరుతడి పంటలకే ప్రాధాన్యం అధికంగా ఇస్తారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతన్నలు జొన్న, మొక్కజొన్న, శనగ, కంది, తెల్ల కుసుమ లాంటి పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోరుబావుల వద్ద, చెరువుల కింద వరి సాగు చేసిన రైతన్నలు యాసంగి పంట కింద మాత్రం ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు.గత వర్షాకాలంలో ఆశిం చిన స్థాయిలో మండలంలో భారీ వర్షాలు కురియకపోవడంతో చెరు వులలోకి భారీగా వరదనీరు చేరలేదు. దీంతో ప్రస్తుతం చెరువులన్ని ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యవసాయ బోరుబావులలో నీరు తగ్గుతుండటంతో మండలంలోని వ్యవసాయదారులంతా ఆరుతడి పం టలకే ప్రాధాన్యం ఇస్తు ఆ పంటలనే సాగు చేస్తున్నారు. దీంతో గత సంవత్సరంతో పోలిస్తే మండలంలో ఈ సారి ఆరుతడి పంటల సాగు పెరిగింది.

ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు



చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు

కోటగిరి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల ప్రహరి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారికి అనుకుని ఉన్న పాఠశాలకు విరామ సమయంలో విద్యార్థులు బయటకు రోడ్డుపైకి వస్తున్నారు. మరో వైపు పాఠశాల చుట్టు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కిటికీలకు సమాంతరంగా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విషపు జంతువులు పాఠశాలలోకి వచ్చే ప్రమాదముంది. మరో వైపు పాఠశాల పైభాగంలో పెద్ద గుంత ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో పశువులు సంచరిస్తున్నాయి. పాలకులు స్పందించి ప్రహరి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. పిచ్చి మొక్కలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బజార్‌కొత్తూర్‌లో బాధితురాలికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

నందిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బజార్ కొత్తూర్ గ్రామానికి చెందిన పల్లికొండ సుమలత అనే బాధితురాలికి ఆదివారం రూ.16వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ అందజేశారు. ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆదేశాల మేరకు అనారోగ్యంతో బాధపడుతున్న పల్లికొండ సుమలత ఆసుపత్రి ఖర్చుల కోసం రూ.16వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ అధ్యక్షుడు యసుఫ్, చింరాజ్‌పల్లి సొసైటీ ఉపాధ్యక్షుడు తెలు నర్సయ్య, సొసైటీ డైరెక్టర్ ఆకుల లక్ష్మీనారాయణ, నాయకులు గోపు ముత్యం, రాజు, గజేందర్, చంద్రయ్య, భూమేష్, తదితరులు ఉన్నారు.

నందిపేట కిరాణ అసోసియేషన్
అధ్యక్షుడిగా చంద్రశేఖర్ ఎన్నిక



నందిపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం కిరాణ అసోసియేషన్ ఎన్నికలు కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండలంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగాయి. అధ్యక్షునిగా మాదస్తు చంద్రశేఖర్ ఐదో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా పాలకుర్తి ప్రదీప్ కుమార్, కార్యదర్శిగా మాయవర్ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా షేక్ ఉస్మోద్దిన్, కోశాధికారి ఊరటి మనోహర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బాలకిషన్, బందం సురేందర్, మాదస్తు సాయన్న, బద్దం ప్రసాద్, కూర శ్రీనివాస్, సీహెచ్.రమేష్‌లు ఎన్నికయ్యారు.

ఘనంగా సాయి పల్లకీ సేవ

ముప్కాల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద సాయి ఆలయంలోఏడు రోజులుగా కొన సాగుతున్న సాయి పారాయణం ఆదివారం చివరి రోజు కావడంతో సాయంత్రం పల్లకి సేవ ప్రారంభించారు. గ్రామంలో వీదివీదినా సాయి పల్లకిని ఊరేగించారు. సాయి భక్తులు భక్తీగీతాలతో చేసిన నృత్యాలు కోలాటాలతో అందరిని ఆకట్టుకున్నాయి. భక్తులు సాయిబాబాను దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ కమిటీ సభ్యులు, సాయి సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రెంజర్లలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముప్కాల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంజర్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 1998- 99 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేనం ఘనంగా నిర్వహించారు. 25ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు ఒక చోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యబుద్దులు నేర్పిన గురువులను శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శంభులింగేశ్వరుడి కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ భక్తుల శివనామస్మరణలు వేదపండితుల వేదమంత్రోశ్చరణలతో శంభులింగేశ్వరుడి కల్యాణం కమనీయంగా జరిగింది. పరమేశ్వరా భక్తులను రక్షించూ అని వేడుకుంటూ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం నగరంలోని శంభులింగేశ్వర ఆలయంలో శివపార్వతుల మాస కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పశుపతి శర్మ, ఉమా మహేశ్వరశర్మ వేద మంత్రాలు పఠించగా అర్చకులు దేవశర్మ, వాసుదేవ శర్మ వేడుకలను జరిపారు.

సంస్కృతికి నిలయాలు.. సరస్వతి శిశు మందిరాలు



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ

పెర్కిట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించారు. ఈ మహా సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ శిశు మందిర్‌లో చదవడం విద్యార్థులు, విద్యార్థినిలు చేసుకున్న పుణ్యమని, భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలతో 43 ఏళ్ల క్రితం 1981లో ప్రారంభమై ఆర్మూర్ చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రథమ స్థానంలో నిలిచి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించిన ఘనత శిశుమందిర్ విద్యాలయానికి దక్కుతుం దన్నారు. శిశుమందిర్ పాఠశాల క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆవిష్కరించి పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులకు, అధ్యాపకులకు అందజేశారు. ఈ సందర్భంగా 1981 నుంచి 2024 వరకు పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు, పాఠాలు బోధించిన పూర్వఅధ్యాపకులు పాల్గొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో అభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో పాల్గొన్న ప్రతీ అధ్యాపకునికి, విద్యార్థికి మెమోంటో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లోక భూపతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పెద్దోళ్ళ గంగారెడ్డి, విద్యభారతి దక్షిణ మధ్యక్షేత్రం సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి సరస్వతి విద్యాపీఠం తెలంగాణ సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర పూర్వవిద్యార్థి పరిషత్ అధ్యక్షుడు హరిస్మరణ్‌రెడ్డి, సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి రవినాథ్, ఆర్మూర్ పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ధన్‌పాల్ వంశీకృష్ణ, సభ్యులు సరస్వతి విద్యామందిర్ అధ్యాపకులు, పాఠశాల ప్రధానాచార్యులు, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

రైల్వేగేటు వద్ద వ్యాన్ బోల్తా



నవీపేట దర్యాపూర్ రైల్వేగేటు వద్ద బోల్తా పడిన వాహనం

నవీపేట, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్ రైల్వేగేటు వద్ద ఆదివారం ఉదయం వ్యాన్‌బోల్తా పడింది. నిజామాబాద్ నుం చి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు గాజు అద్దాల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి దర్యాపూర్ రైల్వే గేటు సమీపంలో బోల్తా పడింది. నవీపేట ప్రధాన రైల్వేగేటు మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 26 నుంచి ప్రధాన గేటును మూసివేసిన విషయం విదితమే. సంబంధిత వాహన డ్రైవర్ ప్రత్యామ్నాయ మార్గం ద్వారా తమ గమ్యానికి వెళ్లాల్సి ఉండగా రైల్వేగేటు పక్కనే ఉన్న తాత్కాలిక చిన్నపాటి రోడ్డుపై వెళ్తుండగా దర్యాపూర్ గేటు సమీపంలో అదుపు తప్పి బోల్తా పడడంతో వాహనంలో ఉన్న అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. విషయంపై ఎస్ఐ వినయ్‌ని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

బాధితులకు సాయం



నాగేంద్రనగర్‌లో చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన బొల్లి దేవాయికి 34 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కాగా కాంగ్రెస్ నాయకులు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరీకి కృషి చేసిన రాష్ట్ర కో-ఆపరేటీవ్ యూనియన్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కోటగిరి,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని పొతంగల్, హంగర్గ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆదివారం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన లబ్దిదారులను సర్వేలో నమోదు చేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న విద్యార్థులు

మెండోర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే చాంపి యన్‌షిప్ పోటీల్లో వెల్కటూర్ లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు శ్రీనాథ్ జస్వంత్‌లు పోటీల్లో పాల్గొని విజయం సాధించారని పాఠశాల కరస్పాం డెంట్ అజ్మత్‌పాషా తెలిపారు. ఈ సందర్భంగా 27, 28తేదీల్లో ముంబాయిలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కటస్ కుంతె ఫైటింగ్ విభా గంలో శ్రీనాథ్ సిల్వర్ పతకంతో, జస్వంత్ రజత పతకం గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రం ట్రోఫీ అందజేశారు. జాతీయస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ వెల్కటూర్ ఉపాధ్యాయుల బృందం అభినందించారు. విద్యార్థులు మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయి కరాటే పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి విజయం సాధించడానికి కృషి చేసిన అజ్మత్‌పాషా, అవినాష్, శివానిలకు పలువురు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎడపల్లిలో రోడ్డు ప్రమాదం



చికిత్స పొందుతున్న బాలుడు

ఎడపల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ళ బాలుడికి తీవ్రగాయాలు కాగా అతని తల్లిదండ్రులకు స్వల్పగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో స్రవంతి అనే ఉపాధ్యాయురాలు విధులు నిర్వహించుకుని భర్త శేఖర్ తన మూడేళ్ళ కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై బ్రాహ్మణపల్లి గ్రామానికి వెలుతుండగా అదే సమయంలో కోటగిరి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు తన విధులు పూర్తి చేసుకుని బుల్లెట్ వాహనంపై నిజామాబాద్‌కు తిరిగి వెలుతుం డగా ఉపాధ్యాయురాలు వెలుతున్న వాహనాన్ని బుల్లేట్ వాహనం ఢీ కొట్టింది. దీంతో ఉపాధ్యాయురాలు స్రవంతి ఆమె భర్త శేఖర్‌కు స్వల్ప గాయాలు కాగా తమ కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆ బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

బోధన్‌రూరల్,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి బైపాస్‌లో విద్యుత్ షాక్‌కు గురై అర్మాన్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. బైపాస్ రోడ్డులోని ఓ స్వీట్ షాప్‌పై ఆదివారం మధ్యాహ్నం అర్మాన్ అనే యువకుడు ఫైన్ బోర్డులు ఫిట్టింగ్ చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టిందని స్థానికులు తెలిపారు. విద్యుత్ షాక్‌తో గాయాల పాలైన యువకుడిని స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన యువకుడు బీహార్‌కు చెందిన అర్మాన్ బోధన్‌లో పని చేస్తూ నివాసం ఉంటాడు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు

బోధన్‌రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని బీడీ ఖార్ఖానాలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బీడీ కార్మికులకు పింఛన్‌లను పెంచి ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి మోసపోయారని, కాంగ్రెస్‌లకు ఓట్లు వేసి గెలిపించారన్నారు. వంద రోజుల్లో బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను, వాగ్దాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. బీడీ కార్మికులపై ఆధారపడి జీవించే ప్రతి ఒక్కరికి 4వేల రూపాయల జీవన భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకులు భాగ్య, లక్ష్మి, రెహానా బేగం, బీపాషా బేగం, మౌనిక, బీడీ కార్మికులు తదితరులున్నారు.

భక్తి



మహా పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

అయ్యప్ప దీక్షతో
తొలగనున్న కష్టాలు

● మఠాధిపతి సోమలింగశివాచార్యులు



సోమలింగ శివాచార్యులను సన్మానిస్తున్న దృశ్యం

బిచ్కుంద, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియమ నిష్ఠలతో చేపట్టిన దీక్షలతో సంసార జీవన సాగరంలో ఎదురయ్యే కష్టాలు ఖచ్చితంగా తొలగిపోతాయని బిచ్కుంద సద్గురు బండయప్ప స్వామి మఠాధిపతి సోమలింగ శివాచార్యులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చిల్లెల శ్రీనివాస్ 18 సార్లు అయ్యప్ప మాల ధరించిన సందర్భంగా శనివారం రోజు అంగరంగవైభవంగా మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. భారీ సెట్టింగ్‌లో గణపతి సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి విగ్రహం మూర్తులను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు పంచామృతంతో అయ్యప్పకు అభిషేకాలు మంత్రోశ్ఛరనల మధ్య పూజా కార్యక్రమాలు కమనీయంగా నిర్వహించారు. మధ్యాహ్నం వేల మంది భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ రాత్రి అల్పాహారాన్ని ఏర్పాట్లుచేశారు. పడిపూజ సందర్భంగా అయ్యప్ప స్వాములు భక్తి భజన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. మఠాధిపతి మాట్లాడుతూ నియమనిష్ఠలతో 41 రోజుల పాటు దీక్ష కాలంలో ఒక పూట భిక్ష స్వీకరించడం వల్ల ఆరోగ్యంతో ఉన్నచిన్న చిన్న సమస్యలు తొలగిపోయి ఆరోగ్యవంతమైన పరిపూర్ణత లభించి మానసిక ప్రశాంతత తలపిస్తుందన్నారు. దీక్ష నియమాలతో మనలో ఉన్న చెడు అలవాట్లు కూడా దూరమవుతాయని దీక్ష విరమణ అనంతరం కూడా అందరూ అదే నియమ నిబంధనలను పాటిస్తు నడుచుకోవాలని మఠాధిపతి సోమలింగశివాచార్యులు సూచించారు. అర్ధరాత్రి అయ్యప్ప స్వామి 18 మెట్ల పడిపూజ మెట్ల కర్పూర జ్యోతులను వెలిగించి అంగరంగవైభవంగా భక్తులకు ఆకర్షించేలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంలోని మండలాలతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, బోధన్ నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని అయ్యప్ప స్వాములు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

లింకు నొక్కారో.. ఖాతా ఖాళీ

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- అవగాహన లేక కొందరు.. ఆశతో మరికొందరు
- ఇప్పటికే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న వాళ్లు కోకొల్లలు
- స్వీయ జాగ్రత్తలతో సైబర్ నేరాల నియంత్రణ



సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బోధన్‌రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నీ బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయింది.. నీ మొబైల్‌కు ఓటీపీ వచ్చింది చెప్పండి అంటూ బ్యాంకు అధికారుల పేరుతో తెలియని వ్యక్తులు కాల్ చేస్తుంటారు. మరి కొందరేమో మీరు లక్కీ డ్రాకు ఎపికయ్యారు. మేము అడిగే అతి సులభమైన రెండు ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి ఆ తర్వాత మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పండి ఇలా రకరకాల వాయిస్ మెసెజ్‌లు, మెసెజ్‌లు లింకు మెసెజ్‌లు ఓపెన్ చేయండి అంటూ ప్రతీ రోజు తరుచు ఫోన్‌లలో ఫేక్ కాల్స్ వస్తుంటాయి. తెలిసి తెలియక లింక్ నొక్కారో ఖాతా ఖాళీ అవుతుంది. ఇటీవల ఇలాంటి కాల్స్ ఎక్కువయ్యాయి. పొరపాటున వారి మాటలు నమ్మి ఓటీపీలు చెప్పారో నిజంగానే మీ బ్యాంకులో ఉన్న కాసులు ఖాళీ అవ్వాల్సిందే. ఏం జరుగుతుందో తెలుసుకుని తేరుకునేలోపే సైబర్ నేరగాళ్లు మన ఖాతాలో డబ్బులను మాయం చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో ఒక అడుగు ముందుకు వేసి ఖాతాలో డబ్బులను మాయం చేయడమే కాకుండా బ్యాంకు ఖాతాతో లింకు అయిన మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్‌ను బ్లాక్ చేస్తున్నారు. రోజురోజుకు సాంకేతిక అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇలాంటి సైబర్ నేరగాళ్ల తీవ్రత కూడా అంతేస్థాయిలో పెరుగుతుండడం ఆందోళనకు గురి చేస్తుంది. ఒక వైపు పోలీసులు, మరో వైపు స్వచ్ఛంద సంఘాలు సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న రోజుకు ఒకటి చొప్పున సైబర్ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నిర్లక్ష్యరాసులు పడుతున్నారు అనుకుంటే పొరపాటే. అన్ని తెలిసి చదువుకున్న వారు వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు కూడా ఉండడం గమనార్హం.

● అవగాహన లేక కొందరు.. అత్యాశతో మరికొందరు

పెరుగుతున్న సాంకేతికత అందరి చేతుల్లోకి స్మార్ట్ ఫోన్‌లు అందుబాటులోకి రావడం వాటికి తగ్గట్టుగా తక్కువ రేటుకు ఇంటర్నెట్ సేవలు అందుతుండడంతో ఎటు నుంచి ఏ సైబర్ కేటుగాడు మోసానికి పాల్పడతాడో అర్థం కాని పరిస్థితి. మారుమూల పల్లెల్లోని చిరు దుకాణాల నుంచి కార్పొరేట్ స్థాయి షాపింగ్‌లు, సూపర్ మార్కెట్‌లలో సైతం కొనుగోలు, అమ్మకాలకు చెందిన ప్రతీ లావాదేవీలు యూపీఐ అకౌంట్ ద్వారా చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు చేస్తున్న ప్రతీ యూపీఐ చెల్లింపులన్నీ ప్రైవేటుకు చెందింది కావడంతో తమ వ్యక్తిగత సమాచారం వాళ్ల వద్ద ఉండిపోతుంది. అదే అదనుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ మోసాలకు తెర లేపుతున్నారు. మెసెజ్, వాట్సప్‌ల ద్వారా తప్పులు లింకులు షేర్ చేస్తున్నారు. తెలిసి తెలియక వాటిని నొక్కిన వెంటనే మన ఖాతాలోని డబ్బంత మాయమైపోతుంది. వీటితో పాటుగా కొంతమంది నకిలీ వెబ్‌సైట్‌లను క్రియేట్ చేస్తుండడంతో స్మార్ట్‌లకు వచ్చే బల్క్ వెబ్‌సైట్‌లలో నకిలీవి ఏవో అసలివి ఏవో తెలియక ప్రజలు మోసాలకు గురవుతున్నారు. ఇలాంటి సైబర్ మోసంలో చిక్కుకునే వాళ్లల్లో కొంతమంది ఏం తెలియని వారు ఉండగా మరికొందరు అత్యాశతో రాత్రికి రాత్రే కోటీశ్వర్లుగా ఎదగాలని ఆత్యాశతో నిండ మునుగుతున్నారు. కొందరు ఆదాయ పన్నును తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ మోసాల బారిన పడిపోతున్నారు. కొంతమంది యువత ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి ఖాతాలను గుల్ల చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లలో మొదట గెలిచినట్లు అవకాశం కల్పించి రెట్టింపు డబ్బులు చెల్లించి పూర్తిగా నమ్మించిన తర్వాత ఖాతాలో ఉన్న డబ్బులు మొత్తం మాయం చేస్తున్నారు. ఇటీవల ఇలాంటి ఘటనలు బోధన్ పట్టణంతో పాటు మండలంలో అనేక రకాలుగా జరిగాయి. యువకులు పెద్దఎత్తున తమ డబ్బులను పొగొట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ఇలా జాగ్రత్తలు పాటించాలి

- సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.
- వెబ్‌సైట్‌లు అసలివా, నకిలివా అని తెలుసుకునేందుకు ముందుగానే వాటిని నిర్ధారించుకోవాలి.
- మొబైల్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లు తొందర పడకుండా జాగ్రత్తగా గమనించి ఓపెన్ చేయాలి.
- థర్ట్ పార్టీ అప్లికేషన్‌లు ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు.
- బహుమతి వచ్చిందని, లోన్ వచ్చిందని ఎస్ఎంఎస్‌లు వస్తే నమ్మి మోసపోవద్దు.
- అపరిచితులకు తమ ఖాతా నెంబర్లు, ఓటీపీలు ఇవ్వకుండా ఉండాలి.
- యూపీఐల ద్వారా డబ్బులు చెల్లించే ఖాతాల్లో వీలైనంత మేరకు తక్కువ డబ్బులను ఉంచుకోవడం శ్రేయస్కరం.
- ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియన్‌లను ప్రభుత్వం నియమించింది. వారిని సంప్రదించి అనుమానం నివృత్తి చేసుకోవచ్చు.

వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు


● వెంకట నారాయణ, పట్టణ సీఐ, బోధన్



అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు. అదేవిధంగా ఎవరైనా ఫోన్‌చేసి ఆధార్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఓటీపీ నెంబర్ అడిగితే ఎవరికి కూడా షేర్ చేయొద్దు. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు అనేక రూపాల్లో స్మార్ట్ ఫోన్ ద్వారా మోసం చేసేందుకు సిద్ధంగా ఉంటారు. అటువంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

నత్తనడకన ఆర్‌వోబీ నిర్మాణ పనులు

డిచ్‌పల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని బర్ధీపూర్ శివారులో గల మాధవనగర్ రైల్వేగేట్ ఆర్‌వోబీ వంతెన నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్న ఆర్ అండ్‌బీ అధికారులు కానీ, రైల్వేశాఖ అధికారులు కానీ పట్టించుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వంతెన నిర్మాణం పనులు ఈ ఏడాది జూన్ మాసంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధుల మాటలు నీటిమూటలు అయ్యాయి. నిజామాబాద్‌కు చెందిన ఎంపీ ధర్మపురి అర్వింద్ వంతెన నిర్మాణం పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వంతెన నిర్మాణం పనుల ఆలస్యంతో వాహనదారులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. అంతే కాకుండా వంతెన నిర్మిస్తున్న దిగువ భాగంతో రోడ్డు గుంతలమయం కావడంతో ద్విచక్ర వాహన దారులు, కార్లు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే రోడ్లు భవనాల శాఖ అధికారులు నత్త నడకన సాగుతున్న వంతెన నిర్మాణాలు వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



డిచ్‌పల్లి- మాధవనగర్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్న దృశ్యం

బోధన్‌లో సినిమా షూటింగ్ సందడి

● కమ్మ సంఘంలో బుల్లెట్ రెడ్డి సినిమా చిత్రీకరణ



కమ్మ సంఘంలో ఫైటింగ్ చిత్రీకరణ

బోధన్‌రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ శివారులోని కమ్మ సంఘంలో ఆదివారం బుల్లెట్ రెడ్డి సినిమా షూటింగ్ చిత్రీకరణ జరిగింది. సినిమా షూటింగ్ జరగడంతో సందడి నెలకొంది. హీరో, హీరోయిన్‌లు, సినిమా ఫైటింగ్ చిత్రీకరణ సన్నివేశం జరుగుతుండడంతో అటుగా వెళ్లే ప్రజలు, ప్రయాణికులు ఉత్సాహంగా షూటింగ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. బుల్లెట్ రెడ్డి సినిమా హీరో ఆదినారాయణ, హీరోయిన్ మేఘ, విలన్‌లతో పోరాట దృశ్యాలు చిత్రీకరించారు. ఫైట్ మాస్టర్ ఖయ్యుం ఆధ్వర్యంలో ఫైటింగ్ షూట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన విలన్‌లు ప్రత్యేక పాత్రలో కనిపించారు. ఫైటింగ్ చిత్రీకరణ ఉత్సాహంగా షూటింగ్ నిర్వాహకులు నిర్వహించారు. సిని పరిశ్రమకు బోధన్‌లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా హీరో ఆదినారాయణ మాట్లాడుతూ సినిమా షూటింగ్‌కు పర్మిషన్ ఇచ్చిన కమ్మ సంఘం ప్రతినిధులకు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సినిమా షూటింగ్‌కు వచ్చిన చిత్ర బృందం



సినిమా షూటింగ్ సందడి

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు పోసానిపేట్ పాఠశాల విద్యార్థినులు

రామారెడ్డి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు రామారెడ్డి మండలకేంద్రంతోపాటు పోసానిపేట్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు, విద్యార్థినులు నేటి నుంచి జనవరి 2వ తేదీ వరకు వరంగల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఫుడ్‌బాల్, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆనంద్, శ్రీనివాస్ తెలిపారు. పో సానిపేట్ ఉన్నత పాఠశాల ఐదుగురు విద్యార్థినులు నేహ, నిహారిక, మేఘన, రుతిక, రసజ్ఞలు ఎంపికయ్యారని, జిల్లా బాలికల జట్టుకు కెప్టెన్‌గా నేహ, కోచ్‌గా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నరేష్‌రెడ్డి వ్యవహరిస్తారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు.



రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కి బయలుదేరిన రామారెడ్డికి చెందిన విద్యార్థులు

ఆ జేసీబీ జాడెక్కడ?

- రెవెన్యూ అధికారుల కన్ను గప్పి దుర్కి గ్రామంలో తప్పిపోయిన జేసీబీ, టిప్పర్
- రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



దుర్కి గ్రామంలో సీజ్ చేసిన టిప్పర్, జేసీబీ (ఫైల్)

నసురుల్లాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్కి గ్రామంలో ఈ నెల 26వ తేదీన పక్కా సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు అక్రమంగా మొరం తవ్వుతున్నారన్న సమాచారంతో టిప్పర్, జేసీబీని పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో వాహనాలు, డ్రైవర్లు తప్పించుకున్నారని కట్టుకథలు చెబుతూ రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని దాటవేశారు. అయితే ఈ విషయం జరిగి నాలుగు రోజులైనా కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కనీసం దాని జాడ ఎవరు పట్టుకోవడం లేదంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మొరము తరలిస్తున్న జెసిబి, టిప్పర్, డ్రైవర్లతో సహా పారి పోయారని పలువురు చర్చిస్తే ,అధికారుల కనుసన్నాల్లోనే మామూళ్ల మత్తులో ఉండి, రెవేన్యూ, పోలీస్ అధికారులు వాహనాలను పట్టుకోవడం లేదని మరికొందరు ఆరోపిస్తున్నారు.. ఒక చిన్న మొబైల్ ఫోన్ తప్పిపోతేనే గంటల వ్యవదిలో పట్టుకుంటున్న పోలీసులు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న జేసీబీ, టిప్పర్లను పట్టుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈ కారణంగా అధికారులు మాముల మత్తులో ఉండి మొరం తరలిస్తున్న జేసీబీ టిప్పర్లను తప్పించారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధిలో నిర్లక్ష్యం వహించకుండా మొరం టిప్పర్లను పట్టుకోవాలని అక్రమంగా తరలిస్తున్న మొరం వ్యాపారాన్ని అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● సెలవు దినం కూడా వదలని మొరం మాఫియా

నసురుల్లాబాద్ మండలంలోని మైలారం, దుర్కి, బస్వాయిపల్లి ఆయా గ్రామాల్లో మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. కాగా సెలవు దినం ఆదివారం రోజు ఏ అధికారులు కూడా రారు.. మమ్మల్ని ఏం చేయరు అన్న ఉద్దేశంతో మొరం మాఫియా పెట్రేగిపోతుంది. స్పందించాల్సిన రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ గుట్టలు మాయం చేస్తున్న మొరం మాఫియాపై కన్నెత్తి చూడకపోవడం గమనార్హం

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ లేకుండా తక్కువఎత్తులో నిర్మాణం ● మూగ జీవాలకు శాపంగా మారిన వైనం
- భయాందోళనలో రైతులు, ప్రజలు ● పట్టించుకోని విద్యుత్ అధికారులు

జర దేఖో!!



కొక్కొండ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఎల్లారెడ్డి, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా సౌకర్యం కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కాని పలు గ్రామాల్లో కిందకు ఏర్పాటు చేయడంతో పాటు కంచె ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ ప్రమాదాలకు ట్రాన్స్‌ఫార్మర్లు నేలవుగా మారాయి. తక్కువ ఎత్తులో ఉండటంతో మూగ జీవాలు వాటికి తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా మూగ జీవాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటం, వైర్లు కిందకు వేలాడటం లాంటివి శాపంగా మారాయి. ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ గ్రామానికి వెళ్లే రహదారి పక్కన తక్కువ ఎత్తులో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు మేతకు వెళ్లే మూగజీవాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల మండలంలో గాలి వాన భీభత్సాలకు కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.



మనిషికి తగిలేలా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు



తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్న స్తంభం



స్తంభానికి బిగించాల్సిన వైర్లు కట్టెకు కట్టిన దృశ్యం

● కంచె ఏర్పాటు చేయాలి

ప్రతీ ఏడాది పదుల సంఖ్యలో మూగ జీవాలు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోతున్నాయి. వేసవి, వర్షాకాలం ప్రారంభంలో మూగజీవాలు మేత కోసం బయటకు వెళుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. ప్రమాదాలకు నెలవుగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రైతులు వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళుతున్న క్రమంలో గట్ల వెంట రహదారుల పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో ఏ ప్రమాదం వచ్చి పడుతుందో నని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

● ఎత్తులో ఏర్పాటు చేయాలి

తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఎత్తుగా గద్దెలు నిర్మించి దానిపై ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలి. విద్యుత్ ఘాతం నుంచి మూగ జీవాలను కాపాడుకునేలా, విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్దరణ పనులు చేపట్టాలి. - సాయిలు, రైతు

మకర సంధ్య పుస్తకావిష్కరణ

కామారెడ్డిటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని సంకష్టహర గణపతి ఆలయంలో ఆదివారం మకరసంధ్య మాసపత్రికను వేదపండితుడు బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయశర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి మహత్యంతో ప్రచురితమైన వ్యాసం భక్తులకు ఎంతగానో ఉపయోగపడునుందని తెలిపారు. కార్యక్రమంలో పండితుడు సంపత్‌శర్మ, పత్రిక సంపాదకులు శరణదాసు, సుతారి అంజయ్య, బొంబోతుల రవి, విశ్వంగుప్త, పిట్ల సాయిలు పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీ నాయకుల అరెస్ట్

కామారెడ్డిటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నాయకులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్‌పీ రాష్ట్రనాయకుడు లక్ష్మన్ మాట్లాడుతూ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధన కోసం చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడం తగదన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ ఇవ్వకుండా మూడురోజులు ప్రాణాలను పనంగా పెట్టి అమరణ నిరాహారదీక్ష చేస్తే ప్రభుత్వం నుంచి ఒక అధికారి, నాయకుడు కూడా పట్టించుకోలేదని పైగా అరెస్టులు చేయించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అరెస్ట్‌చేసి దీక్ష భగ్నం చేసినంతా మాత్రన తమ లక్ష్యాన్ని ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌పీ జిల్లా కన్వీనర్ బోలేశ్వర్, రాజు,సత్యం, కవిన్, రాజశేఖర్,రాజు,శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మన్‌కీ బాత్‌లో బీజేపీ నాయకులు

బీర్కూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోది మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు టీవీలో వీక్షించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోది దేశ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. దేశం ఎంతగానో ప్రగతి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు నాగేళ్ల సాయి కిరణ్, బీజేపీ నాయకులు సాయిబాబా, వడ్ల బస్వరాజు, శ్రీనివాస్, గజేందర్, సంపత్, సాగర్, బీర్గొండ పాల్గొన్నారు.

'బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి'

దోమకొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంచనూర్, సీతారాంపల్లి, గొట్టిముక్కుల గ్రామాల్లో బీజేపీ బూత్ అధ్యక్షులను ఆదివారం ఎన్నుకున్నట్లు అసెంబ్లీ ఇంచార్జ్ కుంట లక్ష్మారెడ్డి తెలిపారు. అంచనూర్‌లో 84వ బూత్ అధ్యక్షుడిగా నీలంరెడ్డి, 85కు బాయికాడి రాములు, 86కు గంగిరెడ్డి రమేష్, గొట్టిముక్కుల 104 బూత్‌కు ఎస్‌పాల్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మద్దూరి భూపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నత్తి గణేష్, ఎల్లం, శ్రీనివాస్, గంగయ్య, నరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, నాగయ్య, ఆకుల రమేష్, సంతోష్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షా శిబిరం



బీర్కూర్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

బీర్కూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం వాసవీ ఈ అండ్ టీ హాస్పిటల్, శ్రీసాయి హియరింగ్ క్లినిక్‌ల ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడే వారి కోసం ఫ్రీ స్క్రీనింగ్ పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు మేకల గాలయ్య, సీనియర్ లయన్స్ మేకల విఠల్, కొట్టూరి సంతోష్, రషీద్, దత్తు, బాబు, పెండ్యాల రమేష్, గ్రామ పెద్దలు సానేపు గంగారాం, అవారి గంగారాం, యామ రాములు, సందీప్, లయన్స్ సెక్రటరీ రవీందర్ జెట్టి, సీతలే రమేష్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

భోజనం వికటించి వృద్ధురాలి మృతి

బీర్కూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరం గేడ్గి గ్రామానికి చెందిన లక్కపల్లి గంగవ్వ (60) అనే వృద్ధురాలు ఇంటి భోజనం వికటించి మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 26వ తేదిన బరంగేడ్గి గ్రామానికి చెందిన గంగవ్వతో పాటు ఆరుగురు కుటుంబ సభ్యులు ఇంట్లో వండిన అన్నం, పప్పును అందరూ కలిసి భుజించారు. మధ్యాహ్నం తరువాత గంగవ్వ కుమారుడు సాయిలు, కోడలు రాధిక, మనుమడు సాయివర్ధన్‌లు వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. బంధువులు వీరిని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్స అనంతరం 27వ తేదిన కొడుకు, కోడలు, మనుమడు పూర్తిగా కోలుకున్నారు. గంగవ్వ పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు ఆమెను నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గంగవ్వ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారు. ఫుడ్ పాయిజన్ వల్లే గంగవ్వ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఆది వారం గంగవ్వ అంత్యక్రియలు నిర్వహించారు.

కారు బోల్తా



వెలగనూరు శివారులో ప్రమాదానికి గురైన కారు

నిజాంసాగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఏఐ 161 రహదారి వెలగనూరు గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం కారు టైరు పంచరై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఐదుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి నాందేడ్ వెళుతున్న కారు టైరు పగలడంతో అదుపుతప్పి బోల్తా పడగా కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు నలుగురు ప్రయాణికులూ సురక్షితంగా బయటపడ్డారు. ఎన్‌హెచ్‌ఏఐ మొబైల్ బృందం హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని స్వల్పంగా గాయాలైన వారికి ప్రథమ చికిత్స చేశారు. అదుపు తప్పి బోల్తా పడ్డ కారును ఎన్‌హెచ్‌ఏఐ మొబైల్ బృందం వెలికి తీశారు.

ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన, బోనాల ఊరేగింపు

రామారెడ్డి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో ప్రసిద్ధిచెందిన గట్టు మల్లన్న ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదివారం గండ దీపాలు, బోనాలప్రదర్శన, ఎడ్ల బండ్ల ఊరేగింపు పోటాపోటీగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ బృందం, రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.



అన్నారం గ్రామంలో బోనాల ఊరేగింపు

స్పెషల్ ఆఫీసర్ల నియామకంపై నిరసన



నిరసన వ్యక్తం చేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నిజాంసాగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆదివారం సమగ్రశిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ 20 రోజులుగా సమ్మెచేస్తున్నా పరిష్కారం చూపించకుండా అధికారులు కస్తూర్బాల లో ప్రత్యేక అధికారులను నియమించడంతో వారికి పుష్పగుచ్ఛమిచ్చి నిరసన తెలిపామన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గతంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన వ్యక్తపరచిన సమయంలో హనుమకొండలో సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నాకు అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేము అధికారంలోకి రాగానే 10 నిమిషాలలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. ఐకేపీ, వీఆర్‌ఏలను కాంట్రాక్టు లెక్చరర్‌లను రెగ్యులర్ చేశామని ఆయన గుర్తుచేశారు. తమకు రెగ్యులరైజేషన్ చేయడంలో ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన అన్నారు. సమగ్ర శిక్షాలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులను నియమించుకోవడం కోసం అప్పటి ప్రభుత్వం, అధికారులు పత్రికా ప్రకటనలు ఇచ్చి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ముగ్గురు మెంబర్లతో కమిటీ వేసి ఈ నియామకాలు రోస్టర్ కం మెరిట్ ప్రకారం ఎంపిక చేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని అలాగే సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి పే స్కేల్ అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజాంసాగర్ మండల విద్యాధికారి వై.తిరుపతిరెడ్డి, మహమ్మద్ నగర్ మండల విద్యాధికారి ఎల్.అమర్ సింగ్ కేజీబీవీ ఇన్‌చార్జి, స్పెషలాఫీసర్ సమత, ఏంఐఎస్ కో-ఆర్డినేటర్ జె.రాజు, సీఆర్పీలు కె.వెంకటరామాగౌడ్, వి.శంకర్ గౌడ్, పి.నర్సింలు, బి.శ్రీధర్‌కుమార్, పీటీఐలు జిహరీష్, కె.భూమయ్య కేజీబీవీ ఉపాధ్యాయులు రజిత, సరిత, రమాదేవి, పర్షన సిబ్బంది అనిత, కవిత లావణ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో రోడ్డు ప్రమాదం.. జిల్లావాసులకు తీవ్ర గాయాలు

నిజాంసాగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదరాబాద్-బోధన్-మెదక్ రహదారిపై జరిగిన టాటా ఏసీ అదుపు తప్పి సంఘటనలో ఆదివారం నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన గైని లింగం కుటుంబం హైదరాబాదులో ఉంటున్నారు. ఆదివారం హైదరాబాద్ నుంచి టాటా ఏసీలో స్వగ్రామానికి వస్తున్నారు. టాటా ఏసీ టైర్ రాడ్ ఊడి పోవడంతో టాటా ఏసీ అదుపుతప్పి రోడ్డు కిందికి దిగిపోయింది. గైనీ లింగం, లక్ష్మి, పాపవ్వ, అపర్ణలతో పాటు మరో రెండు సంవత్సరాల పాప ప్రమాదంలో గాయపడ్డారు. పాపవ్వ, లక్ష్మి, అపర్ణలకు కాలు విరిగాయి. గైని లింగం, డ్రైవర్ శంకర్‌లకు బలమైన గాయాలు తగిలాయి. వీరిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ముగ్గురిని హైదరాబాద్ తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. కొల్చారం పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

'నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపండి'

కామారెడ్డిటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ హైస్కూల్‌లో దళితహెడ్ మాస్టర్ రాములుపై దాడికి నిరసనగా సోమవారం భోజన విరామసమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపాలని ఎస్‌సీ,ఎస్‌టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో ఇద్దరు వ్యక్తుల రిమాండ్



నిందితులతో పోలీసులు

ఎల్లారెడ్డి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అబేద్ హుస్సేన్ ఈనెల 19వ తేదీన తన బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లి తిరిగి 20న ఏటీఎం నుంచి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు డ్రా చేసినట్లుగా అతనికి మెసేజ్ రావడంతో ఎల్లారెడ్డిలోని తన ఇంటికి వచ్చి చూశాడు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని బీరువా తలుపులు పగలగొట్టి ఉన్నాయి. వస్తువులు చిందరవందరగా పడి ఉన్నవి. బీరువాలోని కొంత నగదు, ఏటీఎం కార్డు చోరీ అయ్యాయి. ఏటీఎం కార్డు ఉపయోగించి దొంగలు కొంత డబ్బును డ్రా చేశారని అబేద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎల్లారెడ్డి పోలీసులు దర్యాప్తు చేశారు. చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. వారిలో ఒకరు గతంలో కొన్ని దొంగతనాలు మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్న మెదక్ జిల్లాలోని తొగిట గ్రామానికి చెందిన మాచబోయిన మహేష్, అతనితోపాటు నాగిరెడ్డిపేట మండలం లొంకలపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య అనే ఇద్దరు విచారణలో వారు దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నారని ఎస్సై పేర్కొన్నారు. వారిని ఎల్లారెడ్డిలోని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

ఖాకీలకు ఏమైంది!

- నెలరోజుల్లో ఐదుగురు పోలీసుల ఆత్మహత్య
- ఇద్దరు ఎస్సైలు, ముగ్గురు కానిస్టేబుళ్లు

భిక్కనూరు, డిసెంబరు 29: సమస్యలతో పోలీసుస్టేషన్‌కు వచ్చే వారి సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిస్తూ తప్పుచేసిన వారిని దండిస్తూ ఎవరికి ఆపదొచ్చిన మీకు మేమున్నామని ప్రజలకు భరోస కల్పించే ఖాకీలకు ఏమైంది. ఏవేవో కారణాలతో ఒకే నెలలో ఐదుగురు పోలీసులు వరుస ఆత్మహత్యలకు పాల్పడటం పోలీసుశాఖను కలవరపెడుతోంది. ఎన్నోఆశలతో పోలీసు ఉద్యోగాన్ని పట్టుదలతో సాధించి తల్లిదండ్రులు, కుటుంబానికి, గ్రామానికి మంచి పేరును తీసుకురావాల్సింది పోయి ఏవేవో కారణాలతో కొందరు పోలీసులు బలన్మరణానికి పాల్పడుతూ వారినే నమ్ముకున్న తల్లిందండ్రులకు, భార్యపిల్లలకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. డిసెంబర్ నెలలోని మొదటివారంలో ములుగు జిల్లాలో యువ ఎస్సై హరీష్ అమ్మాయి బ్లాక్ మెయిల్ కారణంతో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకోగా, ఇదేనెలలో 25న కామారెడ్డి జిల్లా భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మరో యువ ఎస్సై సాయకుమార్‌తో పాటుగా భిక్కనూరు సర్కిల్ పరిధిలోని బీబీపేట పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శృతి అనే మహిళా కానిస్టేబుల్ సైతం సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో శవాలై తేలారు. సిరిసిల్లా 17వ బెటాలియన్‌కు చెందిన బాలకృష్ణ ఆదివారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకోగా, మెదక్ జిల్లా కొల్చారం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ సైతం క్వార్టర్స్‌లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇలా రాష్ట్రంలో పోలీసుల ఆత్మహత్యలు పోలీసుశాఖకు మాయని మచ్చగా మారుతున్నాయి.

● పని ఒత్తిడైనా, ఇతర కారణాలైనా ఆత్మహత్యలు సరికాదు!

పోలీసుశాఖ అంటేనే కత్తిమీద సాము లాంటిది. విధుల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఈ శాఖలో షరామాములే. శాంతిభద్రతలను కాపాడే పోలీసన్న మంచి, చెడు అన్నింటిని తట్టుకుని ముందుకుసాగాలే తప్ప ఆత్మహత్యలు పరిష్కారం కావు. తెలిసి తెలియక చేసిన తప్పులు, నీకొచ్చిన సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని వాటి నుంచి ఎలా బయటపడాలో ఆలోచించాలి కానీ ఎక్కడ ఉద్యోగం పోతుందో, ఎక్కడ నిందలు పడుతాయో, సమాజంలో పేరు చెడిపోతుందనో అర్ధాంతంగా తనువు చాలించడం సరికాదు. చిన్న చిన్న విషయాలనే భూతద్దంలో చూసి ఆత్మహత్యలే శరణ్యమంటే నిన్నే నమ్ముకున్న తల్లిదండ్రులు, అన్నివదిలి నీతో వచ్చిన భార్య నీ భర్త, నీ పిల్లలు నీ కుటుంబం రోడ్డున పడటం ఖాయం. మరణించిన కుటుంబాల్లో తీరని దు:ఖం మిగులుతోంది. కామారెడ్డి చెరువులో శవంగా తేలిన మెదక్ జిల్లా కొల్చారం గ్రామానికి చెందిన సాయికుమార్‌ది మధ్యతరగతి కుటుంబం. తన బాబాయ్‌ని ఆదర్శంగా తీసుకుని బాగా కష్టపడి చదివి ఒకేసారి మూడుప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందులో ఎస్సై ఉద్యోగాన్ని ఎంచుకున్న సాయికుమార్‌పైనే అతడి తల్లిదండ్రులు శంకరమ్మ, ఆంజనేయులు, ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య లక్ష్మీ, చిన్నబాబు, అతడి సోదరి ఆధారపడి ఉన్నారు. ఏ కారణంతో సాయికుమార్ చెరువులో శవమై తేలాడో తెలియదు కానీ ఇప్పటివరకు ఎంతో ఆనందంగా ఉన్న ఆ కుటుంబం ఆయన మృతితో ఆధారాన్ని కోల్పోయింది. చెరువులో శవమై తేలిన మరో కానిస్టేబుల్‌ది గాంధారి మండలం. ఆమెకు తల్లిదండ్రులు విజయ, పుండరికం, సోదరుడు ఉన్నారు. శృతిని అల్లారు ముద్దుగా పెంచుకున్న ఆమె తల్లిదండ్రులు ఆమె అకాల మరణాన్ని తలుచుకుని కుమిలిపోతున్నారు. సమస్యలకు ఆత్మహత్యలే పరిష్కారం కాదని తనను నమ్ముకున్న తల్లిదండ్రులను, భార్య, భర్త, పిల్లలకు అన్యాయం చేయవద్దని ప్రజలు, నాయకులు వేడుకుంటున్నారు.

ఆర్యవైశ్యసంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని భారత్‌రోడ్డు ఆర్యవైశ్యసంఘం నూతన కార్యవర్గం ఏర్పటవగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా సిద్దంశెట్టి రమణగుప్తా, ప్రధానకార్యదర్శిగా తాటిపల్లి సునిల్(కుబ్బి),కోశాధికారిగా గంగాదర్, కార్యవర్గసభ్యులు తాటిపల్లి రమేష్‌గుప్తా,కోడిశాల ప్రభాకర్‌గుప్తా, కోడిప్యాక బాలాజీగుప్తా, ముప్పిడిప్రశాంత్‌గుప్తా, తృప్తి అనిల్‌గుప్తా తదితరులతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమితి సభ్యురాలిగా ప్రత్యూషరెడ్డి

కామారెడ్డిటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గసమితి సభ్యురాలిగా ప్రత్యూషరెడ్డి నియామకమయ్యారు. సిద్దిపేటలో జరిగిన 43వ రాష్ట్ర మహాసభలలో తనకు అవకాశం కల్పించినందుకు ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. రాబోయే రోజుల్లో విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు.

సీఎం కప్ పోటీలకు ఎంపికైన పాల్వంచ విద్యార్థి

మాచారెడ్డి,డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):పాల్వంచ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు సీఎం కప్‌పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వరంగల్‌లో జరుగుతున్న సీఎం కప్ పోటీలకు దుర్గలక్ష్మీ, లాస్యభారతీ, అస్మిత ఖోఖోపోటీలలో పాల్గొననున్నారు. బాలుర విభాగంలో ఈశ్వర్ 400 రిలే మిక్స్‌లో,దినేష్,మౌనిక, పరమేష్,పల్లవి 1500 మీటర్ పోటిలకు,వైష్ణవి వర్ధిని 200 మీటర్ల రన్నింగ్ పోటిలలో పాల్గొంటారని తెలిపారు.

బేడ బుడగ జంగం కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా బేడ బుడగ జంగం సంక్షేమ సంఘంను ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షునిగా కొండపల్లి సాయిలు, ప్రధానకార్యదర్శిగా పోచయ్య, కోశాధికారి పొనకంటి నారాయణలతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అదేవిధంగా యువజన సంఘంను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంఘమేష్, ప్రధానకార్యదర్శి కళ్లెం రవి,కోశాధికారి ఇప్ప నవీన్ తదితరులతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నాయకులు విభూతిసాయిలు, తిరుపతి, రాజు, వెంకటి, అల్లం శ్రీను, లక్ష్మీపతి, రవిప్రసాద్, కళ్లెం స్వామి, పుల్లయ్యపండరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇందిరమ్మ సర్వే

గాంధారి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇంటింటా ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వేను నిర్వహించారు. ఇల్లులేని వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇస్తుందని భరోసా కల్పించారు. ఇండ్లు లేని వారికి తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి మంజూరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గడ శంకర్, సంఘవి,బాలయ్య, అల్తాఫ్,హైమద్,బాలయ్య, సరాఫ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

రామారెడ్డి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో నిజ మైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు పార్టీలకు అతీతంగా మంజూరు కానున్నట్లు రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా, నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పరిపాలనలో అందజేస్తుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మాజీజడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి వివరించారు.

మురికి కాలువలో పడి యువకుడి మృతి

కామారెడ్డిటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిజనవాడకు చెందిన గాదంనవీన్ (25) ప్రమాదవశాత్తు మురికికాలువలో పడి మృతిచెందినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన నవీన్ గోల్లవాడ ప్రభుత్వ పాఠశాల వెనుకాల ఉన్న మురికికాలువలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి అన్న శ్యాంరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేయడం జరిగిందని సీఐ తెలిపారు.


ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

తాడ్వాయి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పైడి ఎల్లారెడ్డి ఫామ్ హౌస్‌లో ఎల్లారెడ్డి నియోజకవర్గ ఆర్య వైశ్య సమ్మేళ నాన్ని నిర్వహించినట్లు మండల అధ్యక్షుడు పాత గంగా చరణ్ గుప్తా తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త వ్యాపారవేత్త పైడి ఎల్లారెడ్డి హాజరైనట్లు తెలిపారు. అనంతరం పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆర్యవైశ్యుల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మండలంలోని ఆర్య వైశ్య సంఘ భవనానికి తన వంతుగా 20 లక్షల రూపా యలను ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గౌరిశెట్టి రాజు, శశి, బాబు, భాస్కర్, వేణుగోపాల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లా ఆర్య వైశ్య అధ్యక్షులు మండల సభ్యులు, కార్యదర్శులు ఆయా గ్రామాల ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - రోటి కపడా రోమాన్స్
దర్శన్ - యూఐ
ప్రియా 70 - పుష్ప-2
ప్రియా 35 - మ్యాక్స్

బాన్సువాడ

మహేశ్వరి - పుష్ప-2
వెంకటేశ్వర - మ్యాక్స్

సమ్మెతో చదువులకు ఆటంకం!

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత 20 రోజుల నుంచి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలకు చెందిన సమగ్ర శిక్షా సిబ్బంది సమ్మెలో ఉండడంతో విద్యార్థినిల చదువుకు ఆటంకం ఏర్పడింది. పాఠశాలలో పనిచేసే సిబ్బంది మొత్తం సమ్మెలో పాల్గొనేందుకు ప్రతి నిత్యం జిల్లా కేంద్రానికి వెలుతుండడంతో విద్యార్థి నిల చదువుకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో అధికారులు ప్రత్యామ్నాయంగా ఇతర సిబ్బందిని బోధనకు పంపినా సరిపోయేంత సిబ్బంది రాకపోవడంతో విద్యార్థినిల చదువులు సజావుగా సాగడం లేదు. ముఖ్యంగా 10వ తరగతి చదివే విద్యార్థులు తమకు సంబంధించిన సిలబస్ ఎలా పూర్తవు తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల్లో వార్షిక పరీక్షలు ఉండడంతో ఆ పరీక్షలకు ఎలా సంసిద్ధత కావాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే తాము చదువులు చదివి ఎలా బాగుపడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక బిచ్కుంద మండల కేంద్రంలో అయితే కస్తూరిబా పాఠశాల విద్యార్థులు తమకు పాత అధ్యాపక బృందం కావాలని ఇతర పాఠశాలల నుంచి వచ్చిన సిబ్బంది తమకు అవసరం లేదని పాఠశాలలో ధర్నాకు దిగారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వారిని తమ పాఠశాలలకు పంపాలని విద్యార్థులు కోరుతున్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

